# రాజీ

ఆఫీసు గడియారం ఐదుకొట్టింది. అంతా ఫైళ్లు సర్దుకుంటున్నారు.

విశాల టైప్‌మెషిన్, కాగితాలు సర్ది లేచినిలబడింది. ఇక అక్కడ ఒకక్షణం వుంటానికికూడా మనస్కరించలేదు. అసలు మధ్యాహ్నం నుంచి విశాల పనిచెయ్యలేదు. పనిచేస్తున్నట్టు నటించింది. పనిమీద ఎంత ప్రయత్నించినా మనస్సు లగ్నం కాలేదు. ఉప్పెనలా ఏడ్పు వస్తున్నది. చుట్టూ మనుషులున్నారు. అంతమందిలో తను ఏడ్వ లేదు. ఐదు కొట్టగానే యింటికి వెళ్ళాలి. ఇంట్లో తనుతప్ప ఎవరూ లేరు కనుక, గుండెలమీదున్న బరువు తగ్గినంతవరకు ఏడ్వవచ్చు. మధ్యాహ్నం నుంచి ఇదే ఆలోచన.

లేచి వస్తున్న విశాలని ఆఫీసు మేనేజరు పిల్చాడు. వెళ్ళి టేబుల్‌ముందు మౌనంగా నిలబడింది. ఆయన ఏదోరాసు కుంటు న్నాడు. తలెత్తకుండానే "రెండు అర్జంటు కాగితా లున్నాయి...."

"క్షమించండి. ఇవ్వాళకాదు" విశాల గిరుక్కున తిరిగింది. ఎన్నడూ వినని జవాబు. మేనేజరు ముఖంలో ఆశ్చర్యం అలము కుంది. తలెత్తి చూచాడు. విశాల అప్పటికే ఆఫీసు ఆవరణ దాటింది.

రోడ్డుమీదికి వచ్చి విశాల, ఒక్కసారి చుట్టూచూచింది. తనకు తెలిసినవాళ్ళు ఎవరూ లేరు. పైటకొంగులో దాచిన నీలిరంగు కాగితం బయటకి తీసింది, ముక్కలు ముక్కలుగా చించి గాలిలో వదిలింది.

కాగితాలు గాలిలో ఆడుతున్నాయి.

వేడివేడి కన్నీటిబొట్లు విశాల చెంపలమీద జారుతున్నాయి. కర్చీపుతీసి కన్నీరు తుడుచుకుంది.

ఆఫీసులో జరగిన అవమానం-తన అసహాయత, మాటిమాటికి కళ్ళముందు మెదులుతున్నాయి. మెదడ్లో ఏదో జ్వాల! దుఃఖం గుండెల్లో ఇమడటంలేదు. అదే సంఘటన జ్ఞాపకం వస్తోంది.

లంచ్‌టయిమ్‌లో తను ఏదో ప్రొసీడింగ్స్ టైపు చేస్తోంది. ఆఫీసుప్యూను కాగితాలు పట్టుకొచ్చి 'అర్జంటట! దొరగారు చెప్పారు' అన్నాడు. రెండు కాగితాలు టైపు చేసింది. మూడోది మొదలు పెడుతూ ఆఫీసు రిఫెరెన్సుకోసం వెదికింది. రిఫెరెన్సు సబ్జక్టు ఏదీ లేని కాగితం. తీసి గబగబా చదివింది. అది తనకు రాసిన వుత్తరం! ప్రేమలేఖ! కాసేపు అచేతనంగా వుండిపోయింది. ఎంత తెంపరి తనం! ప్రేమించాడట! తను అంగీకరిస్తే పెళ్ళి చేసుకుంటాడట. ప్రేమించడానికి పెళ్ళి చేసుకోడానికీ తను తేరగా దొరికింది! వళ్ళు మండిపోతూంది విశాలకి. చరచరా వెళ్ళి లాగిలెంపకాయ కొట్టాలని పించింది. నోటికి వచ్చినట్లు తిట్టాలనిపించింది. కానీ తను ఏమీ చెయ్యలేదు. తను అనుకున్నపనిచేస్తే ఆఫీసంతా గోలఅవుతుంది. నలుగురూ చుట్టూ మూగుతారు, నవ్వుతారు. రేపట్నుంచి తను తలెత్తుకొని తిరగలేదు. ఈ ఆలోచనతో విశాలకి ఏడుపు వచ్చింది, తను దిక్కూ మొక్కూలేని ఆడది. అంతకన్నా ఏం చెయ్యగలదు?

అందుకనే, ఆఫీసరు విశ్వేశ్వరరావు అలా తెగించాడు. తెగింపు కాకపోతే, తన్ను ప్రేమించానని పెళ్ళి చేసుకుంటానని చెప్పడానికి ఎన్ని గుండెలు? నలభై కి పైబడ్డ వయసు. భార్య పోయినా ఇద్దరు బిడ్డలువున్నారు. యేమిచూచి వాణ్ని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలి? బ్యాంకులో ఎకౌంటూ, బంగళా, కారు. ఇవన్నీ చూసి తను మనసు పడుతుందనుకున్నాడేమో? అవును అదే ఆలోచించి వుంటాడు.

ఆ ధైర్యంతోనే ఉత్తరం రాశాడు. ఎంత పలచన అయింది తన బ్రతుకు!

ఇట్లా ఆలోచిస్తూనే విశాల ఇల్లు చేరుకుంది. గబగబా తాళం తీసి వెళ్ళి పక్కమీద వాలింది. ఉప్పెనలా దుఃఖం పొంగింది. భోరునఏడుస్తూ కూచున్నది. కాసింత కాఫీ కాచుకుని త్రాగాలని పించలేదు. రాత్రికి అన్నం వండుకోవాలపించలేదు. మనసులో ఒకటే వేధిస్తున్నది. విశ్వేశ్వరరావు చేసిన అవమానం!

ఇదంతా పెళ్ళీ పెటాకులు లేకుండా, ఈ వెధవ వుద్యోగం చెయ్యడంమూలాన జరిగింది. దేవుడు మేలుచేస్తే, త్వరలోనే, తనకు ఈ ఉద్యోగం బెడద తప్పిపోతుంది. హాయిగా పెళ్ళి చేసుకుని: ఇల్లూ, పిల్లలూ....

విశాలకి పదిరోజులనాటి పెళ్ళి చూపుల ఘట్టం కళ్ళముందు మెదిలింది. ఆ మాటకొస్తే పదిరోజులుగా ప్రతిక్షణం విశాల ఆ అనుభవాన్ని నెమరువేసుకుంటూనేవుంది. అతను తదేకంగాచూడటం-తను సిగ్గుతో తలొంచుకొనడం - చూపులు కలసినపుడు అతను నవ్వుతూ పలకరించడం-ఇవన్నీ ఎన్నిసార్లు జ్ఞాపకం చేసుకున్నా విశాలకు కొత్తగానే అగుపిస్తాయి.

తనకు కాబోయే భర్త విశ్వేశ్వర్రావులా గెజిటెడ్ అఫీసరు కాకపోతేనేం. ఈడూ జోడూ. అన్నందాలా తగినవాడు. అదే తనకు గర్వం. తను అతనికి నచ్చింది, తనకూ అతను నచ్చాడు. అన్నయ్య దగ్గరనుంచి వుత్తరం రావడం తరువాయి, తను ఈ వెధవ వుద్యోగానికి రాజీనామాచేసి వెళ్ళిపోతుంది. విశ్వేశ్వర్రావులాటి వాళ్ళు తన్ను అవమానించలేరు!

ఈ ఆలోచనతో విశాలకి కాస్త రిలీఫ్ దొరికింది. మెల్లగా లేచి వెళ్ళి ముఖం కడుక్కుంది. కణతలు పెరుకుతున్నాయి. రెండు గుక్కలు కాఫీ గొంతులో పోసుకోవాలనిపించింది. కాఫీ కాచుకొని, త్రాగగానే కాస్త ప్రశాంతత చిక్కింది.

మధ్యాహ్నం జరిగిన సంఘటనను భూతద్దంలో చూసి, తను అనవసరంగా బాధపడిందేమోనని పించింది. అవును. అతను ఉత్త

రం రాశాడు. అందులో తప్పేమున్నది. ఇష్టమైతే అంగీకరించ వచ్చు. కష్టమైతే మానుకోవచ్చు. ఇంతదానికి యేమేమో వూహించు కొని తన మనసు పాడుచేసుకుంది. ఇంకా నయం ఆ ఆవేశంలో తను ఆఫీసులో గోలచెయ్యలేదు నగుబాట్లయ్యేది. తన బలహీనత బట్టబయలు అయ్యేది. ఉత్తరం చదివినతర్వాత, తన అభిప్రాయాన్ని నేరుగావెళ్ళి ముఖంమీదే చెప్పివుంటే సరిపొయ్యేది.

ఇప్పుడయినా మించిపోయిందిలేదు. ఉదయం వెళ్ళినపుడు చెపితే సరిపోతుంది.

ఈ ఆలోచనతో హృదయంలో వున్న బాధంతా ఒక్కసారి తుడిచివేసినట్టు పోయింది. ఆరాత్రి విశాల నిశ్చింతగా నిద్రపోయింది.

విశాల ఉదయంలేచి కాఫీతాగిన తర్వాత, నిన్నటి విషయం జ్ఞాపకం వచ్చింది. ఈరోజు విశ్వేశ్వరరావుకు తన అభిప్రాయం చెప్పాలి. ఆ అభిప్రాయంలోనే తన ప్రతీకారం వుంది. విశాల త్వర త్వరగా డ్రెస్ చేసుకుంది. ఇంకా తొమ్మిది కాలేదు. ఆఫీసుకు ఇంకో గంట టైం వుంది. విశాల ఇంట్లో పచార్లు చేస్తూవుంది. పోస్టుమాన్ ఉత్తరం అందించి వెళ్ళాడు. అడ్రసు చూసింది. అన్నయ్య వ్రాసిన వుత్తరం అది. ఆత్రంగా చించి చదివింది.

చిరంజీవి విశాలకు ;

రాయపేటనుంచి నిన్న వుత్తరం వచ్చింది, దేవుడికి మన మీద యింకా దయకలగలేదు. ఆ సంబంధం కుదిరే ఆశలులేవు. మన సంబంధం యిష్టమేనట. అయితే కట్నం ఆరువేలకు తక్కు వయితే ఒప్పుకోరట. పెళ్ళిచూపులకు ముందు అమ్మాయి నచ్చాలి గాని కట్నం దేముంది అన్నారు. ఇప్పుడు యిలా అంటున్నారు. ఆరువేలు ఎక్కణ్నుంచి తేను? అంతా మన దురదృష్టం. ఈ సంబంధంకూడా యిలా అవుతుందని అనుకోలేదు....

ఆపై విషయాలు విశాలకి చదవబుద్ధి కాలే కళ్ళలో నీళ్ళు నిల్చాయి. తనమీద తనకే జుగుప్స కలిగింది.

అవును! అన్నయ్య ఎక్కణ్నుంచి తేగలడు ఆరువేలు? కుటుంబ పోషణే కష్టంగా వుంది. శనిలా పైన తను ఒకటి? రొమ్ములమీది కుంపటిలా ఎన్నాళ్లని భరించగలడు? విశాల చెక్కిళ్లమీద నీళ్లు దూకుతున్నాయి. అలాగే చాలాసేపు కూచుంది.

ఉన్నట్టుండి విశాల మెదడ్లో ఏదో ఆలోచన మెదిలింది. కన్నీళ్లు తుడుచుకొని, కాగితం తీసి ఉత్తరం రాసింది.

అన్నయ్యకు.

నమస్కారాలు. మీ ఉత్తరం అందింది. ఇక నాకోసం సంబంధాలు వెదక్కండి. వృథాశ్రమ. నా పెళ్లి విషయంలో నాకు స్వేచ్ఛ యిస్తేచాలు. నేనే వెతుక్కుంటాను.

ఉత్తరం ముగించి విశాల మరో కాగితంతీసి, కాసేపు ఆలోచించి రాయడానికి మొదలు పెట్టింది. విశ్వేశ్వర్రావుగారూ! మీ వుత్తరం చూచాను. మిమ్మల్ని పెళ్లి చేసుకోవడానికి ఎలాటి అభ్యంతరంలేదు.

— విశాల

రెండు ఉత్తరాలూ పూర్తవగానే, లభించింది శాంతో-అశాంతో విశాలకే తెలియలేదు!

— —